హైదరాబాద్ వార్త

ఉజ్జయిని మహాకాళి హుండీ ఆదాయం రూ.23,91,023లు

బేగంపేట జూన్ 10,ప్రభాతవార్త

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి హుండీలు 2నెలల 15రోజులకు సంబందించి సోమవారం ఆలయంలో లెక్కించారు.ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీదేవి,ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి ,ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్,మాజీ ఛైర్మన్ రామేశ్వర్,మాజీధర్మకర్తల మండలి సభ్యులు,బ్యాంకు అధికారులు భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు.రెండు నెలల 15రోజుల ఆదాయం మొత్తం 23,91,023లు వచ్చినట్లు ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు.వీటిలో నోట్లు రూ 22,96,628లు,కాయిన్స్ రూ 94,395లు వచ్చాయన్నారు.ఈ లెక్కింపు కార్యక్రమంలో భక్తులు వివిధ సంస్థల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బడుల్లో..భద్రత ఎంత..?

- -అపార్టుమెంట్‌లు ,ఇరుకు గదుల్లో పాఠ్యాంశాల బోధన
- -చాలా పాఠశాలల్లో కనిపించని క్రీడా మైదానాలు
- -రాజకీయ ఒత్తిళ్లతో అడ్డగోలుగా అనుమతులు
- -చూసిచూడనట్లుగా విద్యాశాఖ అధికారులు
- -అనుకోని సంఘటనలు జరిగినప్పుడే హడావిడి



హైదరాబాద్,జూన్ 10,ప్రభాతవార్త:

నగరంలో ప్రైవేట్ స్కూళ్లు పేరెంట్స్‌కు టెన్షన్ పెట్టిస్తున్నాయి. విద్యార్థులు స్కూలుకు వెళ్ళి ఇంటికి తిరిగొచ్చేదాక తల్లిదండ్రులకు భయాందోళన ఉంటుంది. రేపటి నుంచి స్కూల్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో భద్రత, గతంలో జరిగిన పలు సంఘటనలను చూస్తే తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా తల్లి దండ్రులు పిల్లల భద్రత విషయం పెద్దగా పట్టించుకోకుండా పాఠశాలకు పంపుతున్నారు. ఏదైనా అనుకోని అగ్నిప్రమాదం జరిగితే వారి భద్రత ఎంత వరకు పదిలం అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే బడిలో బాల్యానికి భరోసా ఉంటుందని పలువురు విద్యారంగ నిపుణు తెలుపుతున్నారు. నగరంలో జిప్లస్ నుండి మొదలుపెడితే జీప్లస్4 వరకు బహుళ అంతస్తుల్లో ప్రైవేట్ ప్రైవేట్ పాఠశాలలను నిర్వహిస్తున్నారు. ఇరుకు గదుల్లో, కనీసం వాహనం కూడా లోపలికి వెళ్లలేని ప్రాంతాల్లో ఇలాంటి బహుళ అంతస్తుల భవనాల్లో పాఠశాలలను నిర్వహిస్తు వేలమంది విద్యార్థులను ఇరుకు గదుల్లో కుక్కుతున్నారు. ఇలాంటి భవనాల్లో అనుకోని పరిస్థితుల్లో అగ్నిప్రమాదాలు జరిగితే విద్యార్థులు బయటపడే మార్గాలు మాత్రం కనిపిస్తలేవు. పాఠశాలలు గుర్తింపు తీసుకునే సమయంలో, రెన్యూవల్ సమయంలో మాత్రమే ఫైర్‌సేఫ్టీ సర్టిఫికేట్ తీసుకుంటున్నారు. చాలా ప్రాంతాల్లో అధికార విపక్షాలకు చెందిన రాజకీయ నాయకులు, వారి అనుచరులే యాజమాన్యాలుగా ఉడటంతో వారి నుండి వచ్చే వత్తిడితో నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో కూకట్‌పల్లి,అబిడ్స్ ఘటనలతో అప్రమత్తమైన విద్యాశాఖ గ్రేటర్‌పరిదిలోని స్కూళ్ల పరిస్థితులపై సర్వే చేసింది. సుమారు 2500లకు పైగా ఉన్న స్కూళ్లలో 60శాతం వరకే ఫైర్‌సేఫ్టీ అనుమతులు ఉన్నాయని తేలింది. మిగతా 40శాతం స్కూళ్లలో ఎలాంటి అనుమతులు లేవని గుర్తించింది. ఇవి ఏళ్లనాటివి కావడంతో అనుమతులు తీసుకోలేదని వెల్లడైంది.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి ..

అగ్నిప్రమాద సందర్భాల్లో ఎలా వ్యవహరించాలో చాలా విద్యా సంస్థల్లో కనీస అవగాహన కార్యక్రమాలు నిర్వహించట్లేదు. బహుళ అంతస్తుల భవనంలో విద్యాసంస్థ నడపాలంటే ఆభవనం చుట్టూ అగ్నిమాపక వాహనం ప్రయాణించే స్థలం ఉండాలి. కానీ నగరంలోని చాలా సంస్థల భవనాలు దీనికి విరుద్ధంగా ఉన్నాయి. ప్రైవేట్ స్కూళ్లతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలలోలనే విశాలమైన భవనాల్లోనే ఉన్నాయి. అయితే వీటిల్లో వసతుల విషయానికొస్తే అరకొరగానే ఉన్నాయి. 80శాతం భవానాల్లో అగ్నిప్రమాద నివారణ పరికరాలు లేవు. గ్రేటర్ పరిధిలో 30శాతం ప్రైవేట్ స్కూళ్లు మెరుగైన వసతులతో కొనసాగుతుండగా 70శాతం పాఠశాలలు ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. నాలుగైదు అంతస్తుల భవనం ఉన్నప్పటికీ కనీసం విశాలమైన మెట్లు మార్గం కూడా ఉండటం లేదని, పిల్లలు ఆడుకోవడానికి కనీసం ఆటస్థలాలు కూడా అదుబాటులో లేవని ఆరోపిస్తున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- -లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు
- -జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మీ, ఇంచార్జ్ కమిషనర్ అమ్రపాలి తదితరులు

హైదరాబాద్, జూన్ 10,ప్రభాతవార్త:

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని లేకుంటే సంబంధిత అధికారిపై చర్యలు తీసకుంటామని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మూడు నెలల తర్వాత సోమవారం జిహెచ్ఎంసిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి మేయర్ విజయలక్ష్మీతోపాటు, డిప్యూటీ మేయర్ శ్రీలత, ఇంచార్జ్ కమిషనర్ అమ్రపాలి తదితరులు హాజరై వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున జిహెచ్ఎంసి లో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిదని, ఎన్నికలు ముగిసాయి కాబట్టి ప్రజావాణి కార్యక్రమం ప్రతిసోమవారం యథావిధగా కొనసాగుతుందని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 27 విన్నపాలు వచ్చాయని దాంతో పాటు ఫోన్ఇన్ ప్రోగ్రాం ద్వారా 8విన్నపాలు వచ్చాయని వాటన్నింటిని వారం రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమస్యలను సకాలంలో పరిష్కరించాని పక్షంలో సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ అమ్రపాలి మాట్లాడుతూ ...ప్రజావాణి కార్యక్రమంలో ఎక్కువగా టౌన్‌ప్లానింగ్, ఇంచనీరింగ్, ప్రాపర్టీ టాక్స్‌లకు సంబంధించిన విన్నపాలు ఎక్కువగా వచ్చాయని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో అడిషనర్ కమీషనర్ కె.శ్రీవాత్సవ, శివకుమార్ నాయుడు, నళినీ పద్మావతి, గీత రాధిక, సత్యనారాయణ, ఉపేందర్‌రెడ్డి, యాదగిరి రావు, సిసిపి రాజేంద్రప్రసాద్ నాయక్, ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, వెంటర్నరీ ఛీఫ్ అబ్దుల్ వకీల్, ఛీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు, టాక్స్ వాల్యూయేషన్ అధికారి కులకర్ణి పాల్గొన్నారు.

రెండు మోసాలు... ఒకే బాధితుడు

-డాక్టర్ నుంచి రూ.41లక్షలు టోకరా

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:

అర కొర చదువులు చదివి డిగ్రీ పట్టా కూడా లేకుండా ముఖం తెలియని మనిషి సైబర్ నేరగాడి అవతారం ఎత్తుతుంటే, ఉన్నత చదువులు చదివిన ఎంతో మంది సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడుతుండడంతో సైబర్ క్రైం పోలీసులు ఆశ్చర్యపోతున్నారు. కేవలం పెట్టుబడి పేరుతో చేసే కుంభకోణాల్లో లక్షల డబ్బు పెట్టుబడి రూపంలో పెట్టే క్రమంలో తమ డబ్బుపై అజాగ్రత్తగా వ్యవహరించే సామాన్యులను అప్రమత్తంగా ఉండమని సైబర్ పోలీసులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్ ఫ్రాడ్స్ విషయంలో బాధితులకు కౌన్సిలింగ్ అవసరమని అభిప్రాయపడ్డారు. సైబర్ నేరగాళ్ళు మరో సారి విజృంభిస్తూ క్రిప్టో కరెన్సీ పేరుతో నగరానికి చెందిన గాస్ట్రో సర్జన్ నుంచి రూ.41 లక్షలు కాజేసిన వైనం తాజాగా చోటు చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదవ్వగా సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఏసీపీ శివమారుతి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసుల బృందం తెలిపిన వివరాల ప్రకారం, ఫేస్‌బుక్‌లో పరిచయమైన అపరిచిత వ్యక్తి ద్వారా నగరానికి చెందిన డాక్టర్ ఒకరు బిట్ కాయన్ మార్కెట్ వెబ్‌సైట్‌లో ఖాతా నమోదు చేసుకున్నారు. భారీ ఎత్తున లాభాలు చూపగా ఆకర్షితుడైన బాధితుడు బిట్ కాయన్ మీద పెట్టు బడులు పెట్టాడు. డాక్టర్‌కు కూడా లాభాలు రావడంతో తొలుత నగదుని ఉపసంహరించుకునే అవకాశం కల్పించిన సైబర్ కేటుగాడు, రెండోసారి పెట్టుబడులు పెట్టడంతో తన పనితనం చూపించాడు. ఎంత ప్రయత్నించినా బాధితుడు నగదును తన ఖాతాకు విత్‌డ్రా చేయలేకపోయాడు. మోసపోయిన విషయాన్ని కూడా గ్రహించని ఆ డాక్టర్ మరోసారి అదే తప్పుని చేశాడు. తన ఫేస్‌బుక్‌లో మరో గుర్తు తెలియని వ్యక్తిని పరిచయం చేసుకున్నాడు. క్రిప్టో రికవరీ స్కామర్ 'కీచ్ డీగ్రేడ్' అనే వ్యక్తి ద్వారా 'పిబెక్స్' అనే అనాధారిత వెబ్‌సైట్ నుంచి ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టి మొదటికే మోసపోయాడు. ఈ రెండు మోసాలకు గాను బాదితుడు రూ.41,28,000 పోగొట్టుకున్నాడు.

సికింద్రాబాద్‌లో రూ.14లక్షలు మోసం :

సికింద్రాబాద్‌కు చెందిన నిరుద్యోగ మహిళ(30) నుంచి సైబర్ నేరగాడు రూ.14 లక్షలు కాజేసిన వైనం తాజాగా చోటు చేసుకుంది. టెలిగ్రామ్ యాప్ నుంచి పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో ఎర వేసిన కేటుగాడు, బాధితురాలికి టాస్కుల పేరుతో గూగుల్ మాప్స్ లోని పలు రెస్టారెంట్లకు రేటింగులు ఇచ్చే పని అప్పజెప్పాడు. అనంతరం కొన్ని యూట్యూబ్ వీడియోలను లైక్ చేయించి పలు చానళ్ళకు సబ్‌స్క్రైబ్ చేయించాడు. ఆన్‌లైన్‌లో అతి సులువైన ఈ పనులకు తొలుత బాధితురాలికి కొంత మొత్తంలో డబ్బు చెల్లించిన నిందితుడు, కొన్ని పెయిడ్ ఖాతాలకై కొంత నగదు డిపాజిట్ చేయమన్నాడు. ఈ మొత్తాన్ని కొన్ని గంటలలో రిఫండ్ చేస్తానని నమ్మబలికాడు. దాంతో ఆమె డబ్బు చెల్లించగా మరికొన్ని సింపుల్ టాస్కులను పార్ట్‌టైమ్ ఉద్యోగంలో భాగంగా ఇచ్చాడు. అతడు చెప్పిన ప్రకారం చేసిన బాధితురాలికి ఈ సారి చుక్కెదురైంది. నిందితుడు ఆమెకు ఆన్‌లైన్ టాస్క్ చేసినందుకు డబ్బి వ్వకపోగా, చెల్లించినట్లు స్క్రీన్‌షాట్‌లు పంపించాడు. తొలుత సర్వర్ సమస్యల కారణం చెప్పిన మోసగాడు, అనంతరం బాధితురాలి నెంబర్‌ను బ్లాక్ చేశాడు. ఈ మోసంలో మొత్తం ఆమె రూ.14,05,800 పోగొట్టుకుని సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.సైబర్ మోసగాళ్ళు వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా సామా న్యులకు పరిచయమై నకిలీ వెబ్ సైట్లను, అధిక లాభాలను ఎరగా వేస్తారని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్పారు. సోషల్ మీడియాలో పరిచయమయ్యే వెబ్‌సైట్లన్నీ సెక్యూరిటీ ఎక్సేంజ్ బోర్డాఫ్ ఇండియా(సెబీ) నుంచి ఆమోదం లేనివని, ఇటువంటి వాటిలో పెట్టుబడులు మోసాలకు దారి తీస్తాయని పేర్కొన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగిందనిపిస్తే, ఆలస్యం చేయకుండా 1930 కి డయల్ చేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, పోయిన నగదు రికవర్ అయ్యే అవకాశం అధిక శాతం ఉందని తెలిపారు. సైబర్ క్రైమ్ డాట్ గవర్నమెంట్ డాట్ ఇన్ అనే వెబ్ సైట్ ద్వారా కూడా పిర్యాదు చేయవచ్చని సూచించారు.

నగరంలో దంచి కొట్టిన వర్షం

వర్షం కారణంగా జలమయమైన రోడ్లపై వర్షం నీరును తొలగిస్తున్న డిఆర్ఎఫ్ సిబ్బంది

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. జవహర్ నగర్, మౌలాలీ, దమ్మాయిగూడా, రాధికా థియేటర్ చౌరాస్తా, ఉప్పల్ తదితర ప్రాంతాలలో భారీ వర్షపాతం నమోదయింది. దాంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగగా, రోడ్లు జలమయమై వర్షపు నీరు నిలిచిపోయింది. దాంతో రంగంలోకి దిగిన జిహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది నిలిచిపోయిన వర్షం నీటిని తొలగించారు.

నీట్ పరీక్ష ఫలితాలపై సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలి

సుబోధ్‌కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

సైఫాబాద్, జూన్ 10 ప్రభాతవార్త:

వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యుజి పరీక్షా ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, ఇంటర్మీడియట్ మార్కుల ఆధారితంగా విద్యార్థులకు వైద్య కళాశాలల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది ఎఐవైఎఫ్ నాయకులు సోమవారం హిమాయత్‌నగర్‌లని వై జంక్షన్ వద్ద నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ సుబోధ్‌కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అలాగే ఆయన్ని తక్షణమే పదవి నుంచి తొలగించాలని కోరారు. అంతకు ముందు ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఆనేక మంది నాయకులు సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్డీఎ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న టిడిపి అధినేత ఎన్.చంద్రబాబునాయుడు రెండు తెలుగు రాష్ట్రాలలో 1.40 మంది నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆ విద్యార్థుల పక్షాన నిలబడి ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని నీలదీయాలని కోరారు. ఏజెన్సీ నిర్వక్ష్యంతో విద్యార్థులు భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉందని, విద్యార్థులకు బాసటగా నిలిచి కేంద్ర ప్రభుత్వం నుంచి వైదోలగాలని వారు డిమాండ్ చేశారు. హార్యానాలో పరీక్షా కేంద్రంలో ఒకే గదిలో 8 మంది విద్యార్థులు పక్కపక్కనే కూర్చున్న వారిలో 8 మంది విద్యార్థులకు 720కి బదులు 720 మార్కులు రావడంతో ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందా ?, లేక మాస్ కాపియింగ్ జరిగిందా ? అనే అనుమానం విద్యార్థులలో కలుగుతున్నదని, కొంత మంది గ్రేస్ మార్కులు ఇచ్చామని చెపుతున్న ఏజెన్సీ ఏ ప్రాతిపదికన ఇచ్చారో చెప్పకపోవడంతో విద్యార్థుల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు షేక్ మహమూద్, మాజీద్, కళ్యాణ్, అనిల్, షబినా, పూజా, కిరణ్మయి, నేహా, ప్రమోద్, కిరణ్, తన్మయి, మురహరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపిలతో పార్లమెంట్‌లో పోరాటం చేస్తాం

- రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ప్రసంగిస్తున్న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

చిక్కడపల్లి, జూన్ 10 ప్రభాతవార్త:

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకే కేంద్రం చర్యలకు ఉపక్రమిస్తే కాంగ్రెస్ ఎంపీల ద్వారా పార్టమెంట్‌లో పోరాటం చేస్తామని తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వాచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని అన్ని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు. గత ఎన్నికల ముందు గ్రామీణ పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గ్రామీణ ఉపాధి హామీ పనిదినాలకు 150రోజులకు, కనీసం రూ.400 పెంచడం, పట్టణ ప్రాంతాలకు ఉపాధి పనిని విస్తరింపచేయడం కోసం ప్రయత్నం చేస్తామన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'గ్రామీణ ఉపాధి హామీ చట్టం-ఎదుర్కొంటున్న సవాళ్ళు' అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సుకు మంత్రి సీతక్కముఖ్యఅతిథిగా హాజరైప్రసంగించారు. యుపిఏ కాంగ్రెస్ ప్రభుత్వం, వామపక్షాల కోరిక మేరకు ప్రతి కుటుంబానికి 100రోజులు పనిని కల్పించే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తేవడం జరిగిందని, కాని నేడు బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని నీరుగార్చేందుకు కుట్రలు చేస్తోందన్నారు. రాజ్యసభ సభ్యుడు శివదాసన్‌మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని, చట్టప్రకారం వారం వారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.అడిగిన వారికి పని ఇవ్వకుంటే నిరుద్యోగభృతి కల్పించాలన్నారు. కేంద్రం ప్రకటించిన రోజు కూలీ రూ.300 ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని, పనిచేసే దగ్గర ప్రమాదాలుజరిగితే ఉచిత వైద్యం అందించాలని,చట్టంలో ఉన్న ఎక్కడా అమలు కావడం లేదన్నారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెడితే వేలాది రూపాయలు పేదల రూపంలో గుంజుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ఉపాధి కూలీ పనికి పోతేకూలీ రూ.100 కూడా రావడం లేదన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందన్నారు. ఈ సదస్సులో అఖిలభారత కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్, బి.పద్మ, అఖిలభారత కమిటీ నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, నారీ ఐలయ్య, కొండమడుగు నరసింహా, జగన్, వెంకటయ్య, సాంబశివ, ఆవుల వీరన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెరగనున్న మెట్రో చార్జీలు..?

హైదరాబాద్, జూన్ 10 ప్రభాతవార్త

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు బ్యాడ్ న్యూస్ చెప్పింది. మెట్రో ఛార్జీలు పెంపునకకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఈ సమాచారంలో నిజమెంతనో తెలియదు కానీ.. సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.మెట్రో నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో.. ఉన్నతాధికారులు సూచన మేరకు.. టికెట్ ధరలను పెంచేందుకు ఎల్ అండ్ టీ సంస్థ సమాయత్తమవుతోంది. రోజువారీ నిర్వహణ ఖర్చులు, నష్టాల భారాన్ని తగ్గించుకునేందుకు ఎల్ అండ్ టీ సంస్థ మెట్రో టికెట్ ధరలను పెంచేందుకు సమాయత్తమవుతోంది. ఆ తర్వాత మెట్రో టికెట్ చార్జీలు భారీగా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. మెట్రో ప్రారంభమైన ఛార్జీలు ఇప్పటికీ అమలులో ఉన్నాయి. ఒక్కసారి మెట్రో ఛార్జీలు పెంచితే మరో ఐదేళ్ల వరకు పెంచే అవకాశం లేదు. అందుకే అన్ని అంశాలను బేరీజు వేసుకుని ఛార్జీలు ఎంత పెంచాలనే దానిపై కసరత్తు చేసినట్లు సమాచారం. హైదరాబాద్ మెట్రో... ప్రస్తుతం మూడు మార్గాల ద్వారా రోజుకు 5 లక్షల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో గతంతో పోలిస్తే మెట్రో రద్దీ కాస్త తగ్గిందని చెప్పవచ్చు. ప్రతి నెలా రూ.45 కోట్ల చొప్పున ఏడాదికి రూ.540 కోట్ల నష్టం వాటిల్లిందని ఎల్ అండ్ టీ తాజాగా వెల్లడించింది. ఈ క్రమంలో ధరలు పెంచి నిర్వహణ భారాన్ని తగ్గించుకునేందుకు మెట్రో ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం మెట్రోలో 2 కి.మీ దూరానికి టికెట్ ధర రూ.10లు. 2-4 కి.మీ దూరానికి రూ.14లు టికెట్ వసూలు చేస్తున్నారు. అలాగే 4-6 కి.మీ. దూరానికి రూ.25లు, 6-8 కి.మీ దూరానికి రూ.45లు, 18-22 కి.మీ దూరానికి రూ. 50లు, 22-26 కి.మీ దూరానికి రూ.55లు, 26 కి.మీ కంటే ఎక్కువ దూరానికి రూ.60లు టిక్కెట్ ధర ఉంది. ఇప్పటికే ఫ్రీ బస్సులో ప్రయాణికులు రద్దీ నెలకొంటుంది. దీంతో మెట్రోలో ప్రయాణించేవారి సంఖ్య తగ్గిందని కూడా వార్తలు వచ్చాయి. అంతేకాకుండా.. ఎండవేడిమి తట్టుకోలేక చాలామంది ప్రయాణికులు మెట్రోలో ప్రయాణించేందుకు ఆశక్తి చూపుతున్నారు. అలాగే ట్రాఫిక్ రద్దీ, గుంతలమైన రోడ్ల నేపథ్యంలో పలువురు మెట్రోపై ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఇప్పుడు వానాకాలం మొదలవుతుంది. ఇప్పుడు మళ్లీ ప్రయాణికులు బస్సుబాట పట్టనున్నారు. దీంతో మళ్లీ మెట్రోకు ప్రయాణికులు తగ్గే అవకాశం ఉంది. అయితే ఇదంతా దృష్టిలో వుంచుకుని మెట్రో చార్జీలు పెంచుతారా? అనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రారంభ టిక్కెట్ ధర రూ.10లు కాగా, గరిష్టంగా రూ.60 ఉన్నాయి. టిక్కెట్ రేట్లు 5-10 శాతం పెంచబడతాయని ప్రచారం జరుగుతోంది. కనీస ధర రూ. గరిష్ఠ ధర రూ.20, రూ.80 వరకు పెంచే అవకాశం ఉన్నదని అనధికారిక మెట్రో వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే పెరిగిన ఈ మెట్రో చార్జీలు ఎప్పటి నుంచి అమలులోకి వస్తాయనేది తెలియాల్సి ఉంది.

ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్న నిందితుల రిమాండ్

కంటోన్మెంట్, జూన్ 10 ప్రభాతవార్తః

వివరాలను వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రయదర్శిని తదితరులు

జల్సాలకు అలావాటుపడి ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడుతున్న ముఠాను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు వాహనాల ను దొంగిలించి నకిలీ రిజిస్ట్రేషన్‌లు చేసి ఓఎల్ఎక్స్ యాప్ ద్వారా విక్రయించేవారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని తెలిపిన వివరాల ప్రకారం మియా పూర్‌కు చెందిన మహబూబ్ ఖాన్ కుమారుడు రజాక్ (38) బైక్ మెకానిక్, మియాపూర్‌కు చెందిన నాగేశ్వర్‌రావు కుమారుడు యోహాను (29) డ్రైవర్, మచిలిపట్నంకు చెందిన జి. వెంకటేశ్వర్‌రావు కుమారుడు వెంకటప్పయ్య(28) నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడేవారు. దొంగిలించిన వాహనాలను నకిలీ రిజిస్ట్రేషన్‌లు చేసి ఓఎల్ఎక్స్ యాప్ ద్వారా విక్రహిస్తు న్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వెంకటప్పయ్య ఆర్‌సీలను సృష్టించేవాడు. 4 వాహనాలను, నకిలీ ఆర్సీలను అమ్మినట్లుగా గుర్తించారు. వీరిపై పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు అయి ఉన్నాయి.

పేదలకు చేయూత సిఎం సహాయనిధి : బండి రమేష్

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 10, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదలకు చేయూత లభిస్తుందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్‌లోని రైల్వే ట్రాక్ వద్ద గల గుడిసెలలో నివసిస్తున్న సంగేపులా బక్కయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా అతని కుమారుడు శ్రీకాంత్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావుని సంప్రదించారు. దీంతో ఆయన బండి రమేస్ ద్వారా వారిని నిమ్స్ హాస్పిటల్‌కు పంపించి ఎస్టిమేషన్ లెటర్ తెప్పించి ప్రభుత్వానికి అర్జీ పెట్టుకోగా వారికీ ఒకలక్ష డైభై అయిదువేల రూపాయలు మంజూరు అయ్యాయి. అట్టి చెక్కును బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావులు సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, శ్రీకాంత్, లలితా తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు అభినందనల వెల్లువ..

కిషన్‌రెడికి అభినందనలు తెలుపుతున్న బీజేపీ, జనసేన శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 10, ప్రభాతవార్త

సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి ఎంపీగా గెలిచి కేంద్రంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గంగాపురం కిషన్‌రెడ్డిని, కరీంనగర్ లోక్‌సభ ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్‌లను సోమవారం పలువురు బీజేపీ, జనసేన పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జీ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ఢిల్లీలో కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్‌రెడి, బండి సంజయ్‌లను కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరువురికి కేంద్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని వారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రేమ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

జులై 5, 6 తేదీలలో భవన నిర్మాణ కార్మికుల మహాసభలు

సైఫాబాద్, జూన్ 10 ప్రభాతవార్త:

తెలంగాణ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) హైదరాబాద్ జిల్లా 3వ మహాసభలు జులై 5, 6 తేదీలలో నిర్వహిస్తున్నామని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం యూనియన్ హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి చెట్టుకింద శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎం.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 1996 భవన నిర్మాణ కార్మికుల చట్టం, 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టాలను అమలు చేయాలని, పెంచిన నిర్మాణ రంగంతో వాడే ముడీ సరుకుల ధరలను తగ్గించాలని, అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మోటారు సైకిల్ పథకాన్ని ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెముల నిధులు విడుదల చేయాలని, వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి మాట్లాడుతూ కార్మికుల అడ్డాలపై కనీస సౌకర్యాలు కల్పించాలని, కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని, 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా కమిటి సభ్యులు నాగరాజ్, హైమద్, ఎం.నరసింహ, కాశయ్య, మహమ్మద్ షరీఫ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో వేడుకలు

కేక్ కట్ చేస్తున్న టిడిపి నేతలు

ముషీరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:

హిందూపురం శాసనసభ్యులు నటసింహ నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో భారీ కేక్ కట్ చేసి బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్‌కు చైర్మన్‌గా బాలకృష్ణ ఎంతోమంది క్యాన్సర్ బారిన పడిన సామాన్య పేదలకు చికిత్స అందించటం ద్వారా పునర్జన్మనిస్తున్నారని గుర్తుచేశారు. మూడు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్న బాలకృష్ణ అటు తెలుగు చలన చిత్ర పరిశ్రమలో వంద చిత్రాలకు పైగా నటించి, తనదంటూ ప్రత్యేకతను చాటుకున్నారని కొనియాడారు. హిందూపురం నుండి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించిన బాలకృష్ణ నిండు నూరేళ్లు ప్రజలకు సేవ చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, మేడిపల్లి శ్యాం, ఝాన్సీ, ప్రమీల, యాదగిరిరావు, పుప్పాల బాలకృష్ణ, కప్పకృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కట్ట రాములు, భానుప్రకాష్, కిరణ్, చంద్రమోహన్, రామారావు, వెంకటేష్ చౌదరి, దీపక్, జైస్వాల్, విజయరాజు, యాదగిరి, జోగిందర్‌సింగ్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు అభినందనలు

సైఫాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: కేంద్ర మంత్రులుగా జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రమాణ స్వీకారం చేయడం పట్ల లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారికి ఆయన అభినందనలు తెలియజేశారు. కే ంద్ర మంత్రులుగా వారు తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలని, తెలంగాణ రాష్ట్రానికి విభజన హామీలను రాబట్టడంలో తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు

నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం

బేగంబజార్, జూన్10ప్రభాతవార్త:

దేశ ప్రధాన మంత్రిగా నరేంద్రమోడి మూడవసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సోమవారం జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ ఆద్వర్యంలో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడి చిత్రపటానికి పాలాబిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత దేశాన్ని మరింత అభివృద్ధి చేస్తారన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల ప్రారంభమైంది...పరేషాన్ మొదలైంది

-బేగంపేట ప్రధాన రోడ్డుపై నిల్చిపోయిన ట్రాఫిక్

బేగంపేట జూన్ 10,ప్రభాతవార్త

బేగంపేటలో ఓ ప్రయివేటు పాఠశాల నిర్వాకం వాహన దారులకు పరేషాన్ చేస్తుంది. ఆ పాఠశాల ప్రారంభమైందంటే చాలు ప్రధాన రోడ్డు జాం జాం గా మారి పోతుంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బేగంపేట ప్రధాన రోడ్డుపై ఉండే ఓ పాఠశాల కు వచ్చే వాహనాలతో ఫతేనగర్ లింక్ రోడ్డు,పంజాగుట్టల నుంచి వచ్చే వాహన దారులకు నరకాన్ని చవిచూయిస్తుంది. ఈ పాఠశాలకు గతంలో ఉన్న ఎంట్రీ గేటు మయూరిమార్గ్ జంక్షన్ ఎదుట ఉండేది. అయితే కొద్ది నెలల క్రితం ఫతేనగర్ లింక్ రోడ్డు సమీపంలో ఉన్న ఆ పాఠశాల గేటు ను ఇన్ గేట్ గా మార్చి మయూరి జంక్షన్ ఎదురు అవుట్ గేట్ గా మార్చారు. దీంతో ఆ పాఠశాలకు వచ్చే వాహనాలతో ఉదయం,సాయంత్రం సమయాలలో ఈ ప్రాంతంలో వాహనాలు రోడ్డుపైన భారీ ఎత్తున నిల్చిపోవడంతో బేగంపేట ఫ్లై ఓవర్,ఫతేనగర్ లింక్ రోడ్లపై భారీ ఎత్తున ట్రాఫిక్ నిల్చిపోతుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ పాఠశాలకు లోపల పార్కింగ్ ఉన్నా రోడ్డుపైన వాహనాలను నిలిపి వేయడంపై వాహనదారులు,స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సోమవారం ఆ పాఠశాల ప్రారంభం కావడంతో ఈ ప్రాంతంలో మరోసారి ట్రాఫిక్ జాం అయింది. ఈ జాంలో ఇరుక్కు పోయిన అంబులెన్స్ ఆ ట్రాఫిక్ ను దాటి వెళ్లేందుకు 10 నిమిషాల సమయం పట్టింది. ఒక వైపు పంజాగుట్ట నుంచి వచ్చే బేగంపేట ఫ్లై ఓవర్ నుంచి వచ్చే వాహనాలు ఇక్కడికి కొద్ది దూరంలోనే దిగుతాయి. ఇదే సమయంలో ఫతేనగర్ లింక్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు కూడా ఇక్కడ కిందికి

బేగంపేట ప్రధాన రోడ్డుపైన నిల్చిపోయిన ట్రాఫిక్.

దిగుతాయి. ఈ ప్రాంతంలో వాహనాలు వేగంగా ఉంటాయి. ఒక్కసారిగా ఈ పాఠశాల ముందు ట్రాఫిక్ జాం ఉండటంతో సడెన్‌గా బ్రేకులు వేస్తే ఒక వాహనాన్ని మరో వాహనం ఢీ కొని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అసలే ఈ ప్రాంతం రెండు ఫ్లై ఓవర్లు కిందికి దిగే ప్రాంతం. గతంలో ఎన్నో ప్రమాదాలు సైతం ఇక్కడ చోటు చేసుకున్నాయి. ఇలాంటి ప్రాంతంలో పాఠశాలకు ఎంట్రీ గేటు ఇవ్వడం ఎంత వరకు కరెక్ట్ అంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలలో విశాలమైన పార్కింగ్ ఉన్నా వారి వాహనాలను లోపల పార్కింగ్‌లో ఉంచుకోకుండా ఇలా ప్రధాన రోడ్డుపైనే వాహానాలను నిలిపి వేసి ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించడం ఎంతవరకు సమంజసం అంటూ ప్రజలు,వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇక పాదచారులు కూడా నడిచేందుకు వీలు కూడా ఉండటం లేదని సమీప బస్తీలైన ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ,వడ్డెరబస్తీ,బ్రాహ్మణవాడీ,మాతాజీనగర్,శ్యాంలాల్ బిల్డింగ్ బస్తీల వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ ప్రాంతంలో ట్రాఫిక్ జాం కాకుండా చూడాలని ప్రజలు,వాహనదారులు కోరుతున్నారు.

పి.వి.నరసింహారావు సాహిత్య ప్రత్యేక పునాస సంచికావిష్కరణ

పునాస ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న బుర్రా వెంకటేశం, బాలాచారి, సుదర్శన్‌లు

రవీంద్రభారతి, జూన్ 10 ప్రభాతవార్త :

భారతదేశ పూర్వ ప్రధానమంత్రి, ప్రముఖ సాహితీవేత్త పి.వి.నరసింహారావుకు భారతరత్న పురస్కారం ఇచ్చిన సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ పి.వి.నరసింహారావు సాహిత్యంపై ప్రత్యేకంగా వెలువరించిన పునాస ఏప్రిల్-జూన్ 2024 సాహిత్య సంచికను తెలంగాణ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం మధ్యాహ్నం ఆవిష్కరించారు. ఈ మేరకు రవీంద్రభారతి ప్రాంగణంలోని కళాభవన్‌లోని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి, పునాస సంపాదకుడు డా. రాపోలు సుదర్శన్ తదిర సాహిత్యవేత్తలతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి

-బేగంపేట టిటిఐ ఏసిపి శంకరరాజు

ఏపీస్టేట్ ఫైనాన్షియల్ కార్పోరేషన్ కార్యాలయంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఏసీపీ.

బేగంపేట జూన్ 10,ప్రభాతవార్త

వానాకాలం ప్రయాణాలలో ప్రమాదాలు పొంచి ఉంటాయని,చిన్న పాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి కారణంగా మారుతుందని,అందుకే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని బేగంపేట టీటీఐ ఏ సీ పీ జి.శంకరరాజు అన్నారు. సోమవారం బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ కార్పోరేషన్ సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు,నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకరరాజు మాట్లాడుతూ వర్షాకాలంలో వాహనాలు చాలా జాగ్రత్తగా నడపాలన్నారు. వర్షానికి రోడ్లపై టైర్లు జారిపోయే అవకాశం ఉందన్నారు. అలాగే రోడ్లపై గుంతలు ఉండే ప్రమాదం ఉందని,ముందు వెళుతున్న వాహనాన్ని కూడా గమనిస్తూ నిదానంగా ప్రయాణించాలన్నారు. అతి వేగం ఎప్పుడూ మంచిది కాదన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో కార్లకు ఉండే వైఫర్లు పనిచేసేలా చూసుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రయివేటు బస్సులు రాంగ్‌రూట్లో ప్రయాణిస్తూ ఇతర వాహనదారులకు ఇబ్బందులు కల్గిస్తున్నారని,ఇదే సమయంలో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇలాంటి వాహనాల వల్ల ఆయా జంక్షన్లలో ట్రాఫిక్ జాం అయ్యే అవకాశాలు కూడా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వారు వెలిబుచ్చిన సందేహాలకు ఏ సీ పీ సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 150మంది ఫైనాన్షియల్ కార్పోరేషన్ సిబ్బంది ఏపీఎస్ఎఫ్‌సీ తెలంగాణా డివిజన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ ఎమ్.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ పద్మాకర్ రావు,ట్రాఫిక్ ఎస్సై పాండు రంగరాజు,పీసీ అయాన్,హెచ్ జి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిషన్ రెడ్డిని కలిసిన బిజెపి నాయకులు

యూసుఫ్‌గూడ, జూన్ 10, ప్రభాతవార్త

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన జూబ్లిహిల్స్ నియోజకవర్గం బిజెపి నాయకులు.

దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి తమకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించారని వారందరికి ఎప్పటికి రుణపడి ఉంటానని కేంద్ర మంతి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం జూబ్లిహిల్స్ నియోజకవర్గం బీజేపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే లంకల దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్ళి కిషన్‌రెడ్డిని కలిశారు. ఆయనకు రెండోసారి కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఆయనను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంటరీ పరిధిలోని జూబ్లిహిల్స్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు తమ వంతు కృషి చేస్తానని అన్నారు. తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరిని తాను స్వయంగా కలుస్తానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా బీజేపి అధ్యక్షులు గౌతమ్‌రావు, జూబ్లిహిల్స్ నియోజకవర్గంఅసెంబ్లీ కన్వీనర్ కుంభాల గంగరాజు, అట్లూరి రామకృష్ణ, ప్రేమ్‌కుమార్, పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి : శ్రీగణేష్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను అభినందిస్తున్న బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ తదితరులు

కంటోన్మెంట్,జూన్ 10 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు సూచించారు. సోమవారం సిఈఓను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రసూల్‌పురా, బోయిన్‌పల్లి రమన్నకుంట చెరువు, వెస్ట్ మారేడ్‌పల్లి నాలాల సమస్యలను పరిష్కరించి నాలా పూడికతీక పనులను పూర్తి చేయాలని సిఈఓ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంకి రవిందర్, దేవుడు, తేజ్‌పాల్, సదానంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిహెచ్‌ఎంసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : శంకరన్న

జోనల్ కమీషనర్‌తో బేటీ అయిన బిఎం.ఈయు.శంకర్ ప్రకాశ్ తదితరులు

అడ్డగుట్ట,జూన్ 10 ప్రభాతవార్త: జిహెచ్‌ఎంసిలో పనిచేస్తున్న 4వ తరగతి ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిఎష్కరించాలని కోరుతూ బిఎం.ఈయు. గుర్తింపు పొందన యూనియన్ అధ్యక్షులు శంకరన్న, ప్రధాన కార్యదర్శి అస్రప్ అలీ, జోనల్ అధ్యక్షులు ప్రకాశ్‌లు సోమవారం సికింద్రాబాద్ జోనల్ కమీషనర్‌జ రవి కిరణ్‌తో సమావేశమై ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటిని వెంటనే పరిఎష్కరించాలని ఆయన దృష్టికి తెచ్చారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వారికి రావాల్సిన బకాయిలను వెంచనే చెల్లించాలని, ఇంక్రుమెంట్‌లు సకాలంలో చెల్లించాలని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు నర్సింగ్ రావ్, జహింగీర్ తదితరులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అండగా నిలవాలి

యూసుఫ్‌గూడ, జూన్ 10, ప్రభాతవార్త

బస్తీల సంక్షేమ సంఘాలు అభివృద్ధికి, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వారధిగా నిలవాలని హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, జూబ్లి హిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. సోమవారం ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని హైమావతి నగర్ బస్తీలో జరిగిన సంక్షేమ సంఘం ఎన్నికల్లో కె.బాలు 54ఓట్ల మెజారిటీతో తన ప్రత్యర్థి అయిన సురేష్ గౌడ్‌పై విజయం సాధించారు. ఈసందరర్భంగా శాసన సభ్యులు మాగంటిగోపినాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అందుకు ఆయన వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు డి.సంజీవ, యాదగిరి, నర్సింగరావు, దస్తగిరి, చంద్రశేఖర్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో బిజెపి శ్రేణులు సంబురాలు

నాంపల్లి బిజెపి కార్యాలయంలో సంబురాలలో పాల్గొన్న బిజెపి నాయకులు,అభిమానులు

అఫ్జల్‌గంజ్,జూన్ 10 ప్రభాతవార్త: దేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోడి మూడవ సారి ప్రమాణస్వీకారణం చేసిన సందర్భంగా నాంపల్లిలోని తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయం వద్ద బిజెపి నాయకులు,కార్యకర్తలు అభిమానులు సంబురాలు చేసుకున్నారు,మాజీశాసనసభ్యులు ప్రేమ్‌సింగ్ రాథోడ్,రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జ్ డి.గోపాల్‌జీలు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి ప్రధానమంత్రిగా నరేంద్రమోడి ప్రమాణస్వీకారం చేయడం పట్ల భారతీయులకు గొప్ప వరమన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో పోలీస్ వాహనంపైకి రాయి లేపిన యువకుడు

చార్మినార్,జూన్ 10 ప్రభాతవార్త : తాగిన మైకంలో ఓ యువకుడు పోలీసులపై దాడికి ప్రయత్నించిన సంఘటన మొగల్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..హుస్సేనీఆలంకు చెందిన ముప్పై ఐదు సంవత్సరాల వయస్సు గల ఓ యువకుడు ఆదివారం రాత్రి తాగి చార్మినార్ బస్టాండ్ రహదారిలో ఉన్నాడు. అదే సమయంలో చార్మినార్ బస్టాండ్ రహదారిపై పెట్రోలింగ్ చేస్తున్న మొగల్‌పుర పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ వాహనం వద్దకు ఆ యువకుడు వచ్చాడు. వాహనంలో ఉన్న పోలీసుల పైకి రాయి లేపి కొట్టేందుకు యువకుడు ప్రయత్నించాడు. ఆ సమయంలో యువకుడు తాగిన మైకంలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ కేసును మొగల్‌పుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీ షీటర్లకు యావజ్జీవ కారాగార శిక్ష

చార్మినార్,జూన్ 10 ప్రభాతవార్త : ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో పాతబస్తీకి చెందిన ముగ్గురు రౌడీషీటర్లకు నాంపల్లి మెట్రో పాలిటన్ కోర్టు యావ జీవ కారాగార శిక్షతో పాటు 25 వేల రూపాయలు జరిమానా విధించిందని బహదూర్‌పుర పోలీసులు వెల్లడించారు. బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాద్ కథనం ప్రకారం..రంనాస్‌పుర ప్రాంతానికి చెందిన మన్సూర్‌ను జూపార్కు ఎదురుగా ఉన్న ప్రాంతంలో 2017వ సంవత్సరం జనవరి నెల 28వ తేదీన రంనాస్‌పుర ప్రాంతానికి చెందిన రౌడీ షీటర్లు అయిన షేక్ ఖాలీద్ (40),మహ్మద్ అన్వర్ అలియాస్ అన్ను (35),మహ్మద్ మనావర్ అలీ అలియాస్ బబ్బు (30)లు కలిసి హత్య చేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ హరీష్ కౌశిక్ పర్యవేక్షణలో పోలీసులు కేసుకు సంబంధించిన సాక్ష్యాలను నాంపల్లి మెట్రో పాలిటన్ కోర్టులో ప్రవేశ పెట్టారు. కాగా నాంపల్లి మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి బి.సురేష్ మంగళవారం మన్సూర్‌ను హత్య చేసిన కేసులో ముగ్గురు రౌడీ షీటర్లకు యావజీవ కారాగార శిక్ష విధించారని బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రఘునాద్ తెలిపారు.

ప్రగతి నగర్ చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 10, ప్రభాతవార్త :

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ చెరువులో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ మేరకు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి చూడగా అతనికి సంబంధించిన ఆనవాలు ఏమీ లేకపోవడంతో ఆ వ్యక్తి ఎవరనేది తెలియకుండా ఉందన్నారు. గుర్తు తెలియని మృతుడి వయసు 25 నుండి 30 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులను వెంటనే ట్రైనింగ్‌కు పంపాలి

-బిసి యువజన నిరుద్యోగ సంఘ అధ్యక్షుడు నీలం వెంకటేష్

డిజిపి కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న నీలం వెంకటేష్, పోలీసు అభ్యర్థులు

నాంపల్లి, జూన్ 9 ప్రభాతవార్త : 2022పిసి పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులను వెంటనే ట్రైనింగ్‌కు పంపాలని బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిరుద్యోగ సంఘం అధ్యక్షుడు నీలం వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ అభ్యర్థులను వెంటపెట్టుకొని స్థానిక డిజిపి కార్యాలయంలో ట్రైనింగ్ ఐజి అభిలాషబిస్త్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. చాలామంది అభ్యర్థులు ఇళ్లు విడిచి బైట తలదాచుకొంటూ మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఐజి స్పందిస్తూ ఏఆర్31 సివిల్34 మొత్తం 65మందిని ట్రైనింగ్ పంపుటకు స్థలంలేక ఆర్పిఎస్ గ్రౌండ్ అద్దెకు తీసుకోవడానికి మాట్లాడినట్లు, అయితే అభ్యర్థులను ట్రైనింగ్‌కు పంపడానికి 60 నుండి 80 లక్షల బడ్జెట్ విడుదల చేస్తే 15రోజుల్లో ట్రైనింగ్‌కు పంపడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే తగిన బడ్జెట్‌ను విడుదలచేసి అభ్యర్థులను వెంటనే ట్రైనింగ్‌కు పంపి 65 మంది కుటుంబాలలో సంతోషాన్ని నింపాలని నీలం వెంకటేష్ ముఖ్యమంత్రి ఎను మున రేవంత్‌రెడ్డిని కోరారు. అంతేకాకుండా కొంతమంది అభ్యర్థుల బోనఫైడ్, ఎస్సీ ఇష్యూ ఉన్న వారి కేసులు కూడా వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తిచేశారు.

ట్యాంక్ బండ్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

-కూడలిలో లేని పోలీసులు

-ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారులు

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: ట్యాంక్ బండ్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాణీ గంజ్ వైపు గానీ, లిబర్టీ వైపు గానీ సుమారు గంట సేపటి నుంచి ఒక్క వాహనం కూడా కదిలే పరిస్థితి లేకుండా పోయింది. ఆ సమయంలో రోడ్డు కూడలిలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు తెలుగు తల్లి ఫ్లైఓవర్ కింద మూడు ప్రక్కల నుంచీ ముందుకు రావడంతో ట్రాఫిక్ జామ్ సంభవించ

సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచాలి

వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

నిజాంపేట్, జూన్ 10, ప్రభాతవార్త

నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి ప్రజావాణి కార్యక్రమంలో నిజాంపేట్ నగర పాలక సంస్థ సిబ్బంది మున్సిపల్ కమీషనర్ రామకృష్ణరావు, మేనేజర్ చంద్రప్రకాష్‌కి విపతిపత్రం అందజేశారు. నిజాంపేట్ నగరపాలక సంస్థ కార్యాలయంలో గత 10 నుండి 15 సంవత్సరాలుగా బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్స్పెక్టరున్ల, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ప్రతి పనులలో మున్సిపల్ సిబ్బంది ముందు ఉంటారని, కానీ వారిని ప్రభుత్వం వారిని గుర్తించడంలేదని వాపోతున్నారు. నిజంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేయుచున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచుతూ ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. దీనికి కమీషనర్ స్పందిస్తూ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రతి పని మీ ద్వారానే జరుగుచున్నది. మీకు ఉద్యోగ భద్రత కల్పించుటకు, వేతనాలు పెంచుటకు తగిన అధికారిక విపతిపత్రం అందజేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ సిబ్బంది, సాయి, రమేష్, శివ, రఘు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, జూన్ 10 ప్రభాతవార్తః నిరుపేద ప్రజలకు అనిన సంక్షేమ పథకాలు లభించేలా కృషి చేస్తున్నామని, సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో అన్ని ప్రభుత్వ పథకాలను సీతాఫల్‌మండి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ద్వారానే నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే,మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో మారేడ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించిన వివిధ మున్సిపల్ డివిజన్‌లకు చెందిన 82 మందికి కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పద్మారావు గౌడ్ సోమవారం సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా ప్రతీ ఇంటికి వివిధ సంక్షేమ పథకాలను అందించగలిగామని, అన్ని వర్గాలకు చెందిన వారికి ప్రయోజనం చేకూర్చగలిగామని తెలిపారు. ఓట్లు, ఎన్నికలు, రాజకీయాలతో నిమిత్తం లేకుండా అన్నివేళలా ప్రజలతో సంబంధాలు కలిగి ఉన్నామని అన్నారు. ప్రజలు తమ పనులను సీతాఫల్‌మండిలోని తమ కార్యాలయాన్ని అన్ని పని వేళల్లో సంప్రదించవచ్చని, ప్రభుత్వ పథకాలకు ఎవరికి చిల్లి గవ్వ కూడా లంచం చెల్లించరాదని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు సామలహేమ, సునీత, ప్రసన్నలక్ష్మీ, శైలజ, యువనేతలు రామేశ్వర్‌గౌడ్, తహసీల్దార్ పద్మా సుందరి, అధికారులు శివకుమార్, గరికపోగుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తను వేరు చేసి ఆటోలకు ఇవ్వాలి : కమిషనర్

బండ్లగూడ కార్పొరేషన్‌లో తడి,పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని డబ్బాలు పంపిణీ చేస్తున్న కమీషనర్ శరత్‌చంద్ర

నార్సింగి, జూన్ 10 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ లోని ప్రజలంతా తమ ఇళ్లలోనే తడి,పొడి చెత్తలను వేరు చేసి ఆటోలలో వేయాలని కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 10,11,12.వ, డివిజన్ల పరిధుల్లో శానిటేషన్ ఇంచార్జి ఇన్‌స్పెక్టర్ నరేష్‌తో కలిసి కమీషనర్ పర్యటించారు. పలువురికి తడి,పొడి చెత్తలను వేరు చేసేందుకు గాను డబ్బాలను ఉచితంగానే అందజేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రజలంతా తమ ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు, చెత్త నిలువ ఉండకుండా చూడాలని సూచించారు. నీరు, చెత్త ఎక్కడ నిలువ ఉంటే అక్కడ దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటు వ్యాధులైన డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్ వంటి వాటిని వ్యాపింపచేస్తాయని హెచ్చరించారు. పరిశుభ్రతను పాటిస్తే 80.శాతం వరకు అంటు రోగాలు దూరం అవుతాయన్నారు. ఇళ్లలోనే చెత్తను వేరు చేసి ఆటోల్లో వేయాలని, రోడ్లపై వేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు తౌఫిక్, యాదగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సమాజం కోసం అహర్నిశలు కష్టపడతాం - అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ్ల

ది సిటిజెన్స్ కౌన్సిల్ సంస్థను ప్రారంభిస్తున్న అధ్యక్షులు సీతారాం ధూళిపాళ్ల తదితరుల దృశ్యం.

నార్సింగి, జూన్ 10 ప్రభాతవార్త : మెరుగైన సమాజ నిర్మాణం కోసం అహర్నిషలు కష్టపడుతామని "ది సిటిజెన్స్ కౌన్సిల్" సంస్థ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ్ల పేర్కొన్నారు. సోమవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ది సిటిజెన్స్ కౌన్సిల్ కార్యాలయంను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సూచించినట్లు ఎడ్యుకేట్, ఆర్గనైజ్, యాజిటేట్ అనే పదాలను స్ఫూర్తిగా తీసుకొని మా సంస్థను ప్రారంభించామని వివరించారు. ప్రజలకు విద్య, ఆరోగ్యం, రాజకీయం, మౌళిక వసతులు, ట్రాఫిక్, ప్రభుత్వ సంస్థల పనితీరులో పారదర్శకత, సుపరిపాలన వంటి అంశాలపై అవగాహన పెంపొందించడం కోసం తాము కృషి చేస్తామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి ముఖ్యమైన ఎన్నికల ప్రక్రియ పట్ల అవగాహన కల్పించడం, వారిలో చైతన్యం తీసుకు రావడం, అవినీతికి వ్యతరేకంగా పోరాడటం, కులమతాలకు అతీతంగా సమ సమాజ ఏర్పాటులో భాగస్వాములను చేయడం కోసం మా సంస్థ నిరంతరం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ది సిటిజెన్స్ కౌన్సిల్ సంస్థ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహ్మద్, ఉపాధ్యక్షులుగా అందె లక్ష్మణ్‌రావ్, ఉపకార్యదర్శిగా ఉపేందర్‌నాథ్‌రెడ్డి, కోశాధికారిగా దిలీప్, కార్య నిర్వాహక సభ్యులుగా రామ సుబ్బారెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

మాతాజీనగర్ ఎఫ్‌టిఎల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు

-మజీద్ నిర్మించి మత విద్వేషాలు రెచ్చగొట్టే యత్నం
-బిజెపి నేతలు,బస్తీవాసులు అధికార్లకు ఫిర్యాదు

జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ రవికిరణ్‌కు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నేతలు,బస్తీవాసులు.

బేగంపేట జూన్ 10,ప్రభాతవార్త

బేగంపేట మాతాజీనగర్ లో ఎఫ్ టీ ఎల్ స్థలంలో కొందరు అక్రమ నిర్మాణాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఏకంగా మజీద్ నిర్మాణం చేసారని,వెంటనే ఆ ప్రాంతంలో నిర్మించిన కట్టడాలన్నింటినీ కూల్చివేయాలని కోరుతూ సోమవారం మాతాజీనగర్ బస్తీ కమీటి,బీజేపీ నేతలు పెద్ద ఎత్తున తరలి వెళ్లి మేడ్చల్ జిల్లా కలెక్టర్,నార్త్‌జోన్ లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ,సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్,బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసారు.మాతాజీనగర్ లో సర్వేనెంబర్ 194బై 8 బై 1లో 10 ఎకరాల 20 గుంటల స్థలం ఉంది.ఇది ఎఫ్ టీ ఎల్ గా పేర్కొంటున్నారు.అయితే ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ అధికారులు పేర్కొన్నారు.అయితే ఈ ప్రాంతాన్ని ఓ నిర్మాణ సంస్థ ప్లాట్లుగా చేసి అమ్మకాలు సాగించింది.అయితే కొనుగోలు చేసిన కొందరు ఇక్కడ నిర్మాణాలు చేసారు.స్థానికుల ఫిర్యాదు మేరకు వెంటనే రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ అధికారులు అక్కడ నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించారు.అనంతరం కొద్ది కాలం తర్వాత ఆ స్థలంలో మళ్లీ నిర్మాణాలు వెలిసాయి.2023డిసెంబర్ 29న రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఇక్కడి నిర్మాణాలన్నింటినీ కూల్చివేసారు.మళ్లీ కొద్దిరోజులకే కొత్తగా నిర్మాణాలు కట్టడంతో స్థానికులు కొందరు మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారు.2024 మార్చి 23వతేదీన మరోమారు ఈ ప్రాంతంలో నిర్మించిన కట్టడాలను అధికారులు మరోసారి పూర్తి స్థాయిలో నేలమట్టం చేసారు.అయితే తాజాగా కొందరు ఈ స్థలంలో మజీద్ నిర్మాణం చేయడం,ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో మతాల మధ్య చిచ్చుపెట్టి మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకే అని మాతాజీ నగర్ బస్తీ కమీటీ అధ్యక్షులు నరేష్,బీజేపీ నేత నెమలిఆనంద్(నందూ) డివిజన్ అధ్యక్షుడు గోవింద్,శ్రావణ్‌కుమార్,మైసూర్ మధు,సందీప్‌వర్మ, లక్ష్మణ్, కృష్ణ,లక్ష్మీనారాయణ,చంద్రకళ,సునీతా,శోభ,మంగ,ఉషా,సాయిలు.గంగారాం,దేవిక లతో పాటు పెద్ద ఎత్తున బస్తీ వాసులు,బీజేపీ నేతలు అక్రమ నిర్మాణాలను,మజీద్‌ను తొలగించాలంటూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసారు.నార్త్‌జోన్ లా అండ్ ఆర్డర్ అడిషినల్ డీసీపీ పి.అశోక్,సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ రవికిరణ్,బేగంపేట ఎస్సై జయచంద్రలకు లిఖిత పూర్వక ఫిర్యాదులను అందజేసారు.ఎఫ్ టీ ఎల్ స్థలంలో అక్రమ నిర్మాణాలకు ఇంటి నెంబర్లు ఎలా వస్తాయని,విద్యుత్ మీటర్లు ఎలా ఇస్తారని,వెంటనే ఎఫ్‌టిఎల్ స్థలంలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.ఆ స్థలంలో ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేసి స్థలాన్ని రక్షించాలని,బస్తీ వాసులకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని వారు కోరారు.ఉన్నతాధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

ప్రజావాణిలో బిజెపి ఫిర్యాదులు..

పలు అంశాలపై ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ శ్రేణులు

నిజాంపేట్, జూన్ 10, ప్రభాతవార్త

కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో పలు అంశాలపై బీజేపీ శ్రేణులు సోమవారం అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. బాచుపల్లి సర్వే నంబర్ 134 ఎర్రకుంట చెరువులో మ్యాప్స్ కన్స్ట్రక్షన్స్‌తో పాటు మరో రెండు నిర్మాణాలపై ఫిర్యాదు చేశారు. మార్చి 18 జయంతి సర్వే చేసిన రిపోర్ట్ సబ్మిట్ చేయని సర్వే ఐడి ఫిర్యాదు, బాచుపల్లి సర్వే నెంబర్ 545 ప్రభుత్వ భూమి అప్రోచ్ రోడ్‌గా చూపించుకొని అనుమతులు తెచ్చుకున్న ఆకృతి కన్స్ట్రక్షన్స్‌పై ఫిర్యాదు చేశారు. అలాగే దుండిగల్ 614, 641 నందు 8 ఎకరాల ప్రైవేట్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు చేశారు. కెఎల్‌యు ఆపన క్యాంపస్ భూముల అమ్మకం కొనుగోలు భూ బదలాయింపు అవకతవకలపై ఫిర్యాదు చేశారు.

పాత్రికేయరంగానికి రామోజీరావు ఆదర్శం

రామోజీరావు చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న పూర్వపాత్రికేయులు

హైదరాబాద్,జూన్ 10,ప్రభాతవార్త:

పాత్రికేయ రంగానికి రామోజీరావు అదర్శమని పలువురు పూర్వ పాత్రికేయులు అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనాడు జర్నలిజం స్కూల్ మొదటి బ్యాచ్‌కు చెందిన పూర్వ పాత్రికేయుల ఆధ్వర్యంలో రామోజీరావుకు సంతాభ సభ నిర్వహించారు. దీనికి ఆబ్యాచ్‌కు సంబంధించిన సుమారు 50మందివరకు హాజరై రామోజీరావుకు నివాళ్లు అర్పించి ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిని,వ్యాపారాన్ని వేర్వేరుగా చూసి..ఎవరిపాత్రలో వారు రాణించేవిధంగా శాస్త్రీయ శిక్షణ ఇచ్చి ఉత్తమ పాత్రికేయులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో పూర్వ పాత్రికేయులు మల్లీశ్వర్, ఎ.రజాహుస్సేన్, మండవ దుర్గాకుమార్, పాశం యాదగిరి, వినయ్‌కుమార్, చెన్నయ్య, సుందరసాయి, కె.వేణుగోపాల్, ఇస్మాయిల్, హేమ సుందర్ శరత్‌కుమార్, కేశవులు, రాధాకృష్ణ, కాంతయ్య, సర్వేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంశీ రామరాజుకు 'సాంస్కృతిక సేవ సమ్రాట్' బిరుదు ప్రదానం

వంశీ రామరాజుకు 'సాంస్కృతిక సేవా సమ్రాట్' బిరుదును ప్రదానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి, జూన్ 10 ప్రభాతవార్త:

వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు 'సాంస్కృతిక వజ్రోత్సవం' సందర్భంగా 'స్వర్ణకంకణం' బహూకరించి ఘనంగా సత్కరించే కార్యక్రమం సోమవారం జరిగింది. గత కొన్ని దశాబ్దకాలంగా సాంస్కృతిరంగంలో విశేషంగా ప్రతిభ నబర్చిన గొప్ప వ్యక్తి వంశీ రామరాజు అని వక్తలు కీర్తించారు. అమెరికాలో చార్లెట్ నగరంలోని హిందూ సెంటర్‌లో అక్కడ స్థిరపడిన తెలుగు వారు ఓ కార్యక్రమాన్ని నిర్వహించిన కార్యక్రమంలో చార్లెట్ ఇండియా అసోసియేషన్ వ్యవస్థాపకుడు అల్బీనియా నగర పూర్వ కౌన్సిలర్ గుణ ఎస్.కొమ్మరెడ్డి కొమ్మారెడ్డి శ్రీనివాస్‌రావులు హాజరై వంశీ రామరాజును సత్కరించి 'సాంస్కృతిక సేవా సమ్రాట్' బిరుదుతో సత్కరించి అభినందించి ప్రసంగించారు. వివిధ దేశాలలో స్థిరపడిన ప్రవాసభారతీయులకు ఆప్తునిగా తెలుగుదనానికి విదేశీ తెలుగువారికి వారధిగా రామరాజు సేవ అవురూపమని అన్నారు.

డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి నిరంతరం పాదయాత్ర..

వాంబే కాలనీలో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 10, ప్రభాతవార్త

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాదయాత్ర చేపట్టనున్నామని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఆల్విన్‌కాలనీ పరిధిలోని వాంబే కాలనీలో రోడ్లు, డ్రైనేజీ లైన్లకు సంబంధించి సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ సోమవారం జిహెచ్ఎంసి అధికారులు, కాలనీ వాసులతో కలిసి వాంబే కాలనీ మొత్తం పర్యటించి పాదయాత్ర చేస్తూ సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాంబే కాలనీలో కొన్ని చోట్ల బిల్డింగ్ మధ్యలో నూతన డ్రైనేజీ లైన్ నిర్మించి, ప్రధాన లైన్‌కు కలిసి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, అదేవిధంగా త్రాగునీరు సమస్య లేకుండా చూడాలని వాటర్‌వర్క్స్ అధికారలకు తెలియజేశారు. కాలనీలో చాలాచోట్ల మట్టికుప్పలు ఉన్నాయని వాటిని తొలగించకుంటే రానున్న వర్షాకాలంలో కుత్బుల్లాపూర్ నుండి వచ్చే వరద నీటితో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనీ, వెంటనే మట్టి కుప్పలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలోనే సీసీరోడ్లు నిర్మించి, చెట్లుపెట్టి కాలనీని సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రావణి, ఝాన్సీ, రవికుమార్, నాగేశ్వర్‌నాయక్, నరసింహులు, శివ, సుదర్శన్, వెంకటర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మా రెడ్డి, శివరాజ్‌గౌడ్, వెంకట్‌నాయక్, వాసు, పోశెట్టిగౌడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు శంకర్ యాదవ్ మృతి

- ప్రముఖుల పరామర్శలు

తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

కంటోన్మెంట్, జూన్ 10 ప్రభాతవార్తః

మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు శంకర్ యాదవ్ (61) సోమవారం తెల్లవారుజామున మరణించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. శంకర్ యాదవ్ ప్రస్తుతం మోండా మార్కెట్ అధ్యక్షుడు. హమాలీల అసోసియేషన్ అధ్యక్షుడిగా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారు. శంకర్ యాదవ్ మరణ వార్త తెలుసుకున్న వ్యాపారులు, కార్మికులు పెద్దయెత్తున వెస్ట్ మారేడ్‌పల్లిలోని రాధికా కాలనీలో గల శంకర్ యాదవ్ నివాసానికి చేరుకున్నారు. తన సోదరుడి పార్థివ దేహం చూసి తలసాని శ్రీనివాస్ యాదవ్ కన్నీటి పర్యంతమైయ్యారు.

పలువురు ప్రముఖుల పరామర్శ.....

మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పలువురు ప్రముఖులు పరామర్శించారు. శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు శంకర్ యాదవ్ మృతి వార్త తెలుసుకున్న పలువురు వెస్ట్ మారేడ్‌పల్లిలోని శంకర్ యాదవ్ నివాసానికి చేరుకున్నారు. ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను, శంకర్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహముద్ అలీ, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, ఏలూరు పార్లమెంట్ సభ్యుడు పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేష్, మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, అనిల్ కుర్మాచలం, రజనీ సాయిచంద్, రాజీవ్‌సాగర్, దాసోజు శ్రవణ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, నివేదిత, బీజేపీ నేతలు చికోటీ ప్రవీణ్, ముఠా జయసింహ ఇతర నేతలు తలసాని కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

- నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్

నార్సింగి ఉన్నత పాఠశాలలో "క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమంలో భాగంగా చీపురు పట్టుకొని చెత్తను ఎత్తుతున్న చైర్ పర్సన్ నాగపూర్ణ.

నార్సింగి, జూన్ 10 ప్రభాతవార్త :

ప్రజలందరూ స్వచ్ఛందంగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కమీషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ గోపాల విజయ్‌బాబు తదితరులతో కలిసి నాగపూర్ణ "క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె చీపురు పట్టి చెత్తను తొలగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరిశుభ్రతను పాటిస్తే 80.శాతం రోగాలకు దూరంగా ఉంటామని తెలిపారు. ప్రజలు తమ ఇంటిలోని చెత్తను ఎత్తి రోడ్లపై వేయవద్దని, ఇళ్లముందుకు వచ్చే ఆటోలలోనే వేయాలని సూచించారు. ఇంటి ఆవరణలోగాని, లోపలగాని నీరు, చెత్త నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని నీరు, చెత్త నిలువ ఉంటే అంటు వ్యాధులను వ్యాపింపచేసే వైరస్‌లు, బ్యాక్టీరియాలు వృద్ధి చెందే ప్రమాదముందన్నారు. వ్యాధులు వచ్చిన తరువాత అవస్థలు పడేకన్నా అవి రాకుండా నివారణ మార్గాలను పాటించడం అలవాటు చేసుకోవాలన్నారు. వర్షాకాలం ముగిసేంత వరకు ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని సేవించాలని, తాజా ఆహారంను భుజించాలని, ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీలు, ఓపెన్ నాలాల వద్ద చెత్త నిలువ ఉండకుండా నార్సింగి మున్సిపల్ పారిశుద్య సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని, ఎక్కడైనా చెత్త నిలువ ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకు రావాలని చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు వినోద్ కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

-ఎసిపి జి.శంకర్‌రాజు సూచన

సమావేశంలో మాట్లాడుతున్న ఎసిపి జి.శంకర్‌రాజు

సైఫాబాద్, జూన్ 10 ప్రభాతవార్త:

వర్షాకాలంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయని, నిర్లక్ష్యం చేస్తే పెద్ద ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉందని, ట్రాఫీక్ నియమ నిబంధనలను పాటించి ప్రమాదాల నుంచి రక్షించుకోవాలని ట్రాఫీక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ జి.శంకర్‌రాజు వాహనందారులకు సూచించారు. ఈ మేరకు ఇనిస్టిట్యూట్ బేగంపేట సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ఎపి స్టేట్ ఫైనాన్షియల్ కార్పోరేషన్, తెలంగాణ డివిజన్ సిబ్బందికి 'రోడ్డు ప్రమాదాలు-నివారణ' అనే అంశంపై జి.శంకర్‌రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. వర్షాకాలంలో వాహనాలను చాలా జాగ్రత్తగా నడపాలని, వానాకాలం వచ్చిందంటే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా రోడ్లు పాడవటం వల్ల గుంతలు నీటితో నిండి ఉంటాయని దీంతో ప్రమాదాలు జరుగుతాయని, అంతేకాకుండా రోడ్లపై టైర్లు జారడం వల్ల బ్రేక్ వేసినా ద్విచక్రవాహనాలు, కార్లు కొన్ని సందర్భాల్లో ఆగవని, ఈ విషయాన్ని వాహనందారులు గమనించాలని ఆయన సూచించారు. వానాకాలంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ప్రయాణాన్ని సాఫీగా సాగించవచ్చునని, అతివేగం వేగంతో వాహనాలు నడపకుండా ఉండటం ఉత్తమమని, రోడ్లపైన వెళ్ళేటప్పుడు ముందున్న వాహనాలకు మధ్య దూరం పాటించాలని, వర్షం కురుస్తున్నదన్న అత్రతతో ఎట్టి పరిస్థితుల్లో వేగంగా వెళ్ళరాదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో 150 మంది ఉద్యోగులతోపాటు పోలీస్ అధికారులు శ్రీఅయాన్, శ్రీకృష్ణ, ఆర్.పాండురాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యసూత్రాలను ప్రతి ఒక్కరు పాటించాలి

చిక్కడపల్లి, జూన్ 10 ప్రభాతవార్త: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు దృష్టిసారించడంతో పాటు ఆహారం తీసుకునే విషయంలో పలు జాగ్రత్తలు పాటించాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ సూచించారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సిరిధాన్యాలను విరివిగా తీసుకుంటే ఎంతో మేలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రాచీన ఆహార అలవాట్ల వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. గతంలో ఇటువంటి ఆహారం తీసుకున్న మన పూర్వీకులు ఎంతో ఆరోగ్యంగా జీవించారని గుర్తు చేశారు. ఆహార అలవాట్లలో అనేక మార్పులు రావడం వల్ల నేడు వృద్ధులు, పిల్లలు, యువవకులు అనే తేడా లేకుండా వివిధ రకాల రోగాల బారిన పడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇది మంచి పరిణామం కాదని, ఆరోగ్యంగా ఉండాలంటే సిరి ధాన్యాలు ఎంతో అవసరమన్నారు. నల్లకుంటలోని నూతన నంగా ఆరోగ్యానికి ఎంతో మేలు జరిగే విధంగా స్వాస్థ్య వేదిక ఫుడ్స్ నిర్వాహకురాలు వల్లభనేని ప్రసాద్ భారతి నేతృత్వంలో కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డీ కోకన్వీనర్ లువల్లభనేని భారతీ,వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బిజెపి నాయకులు

కేం

అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేయండి : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

అధికారులు, కార్పొరేటర్లతో సమీక్ష నిర్వహిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 10 ప్రభాతవార్త: వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అధికారులకు సూచించారు. జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో కమీషనర్ జి.రఘు, వివిధ శాఖల అధికారులతో పాటు డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చేపట్టిన నాలా పనులు, ప్రధాన, అంతర్గత రోడ్ల నిర్మాణపు పనులతో పాటు తాగునీరు, వీధి దీపాల తదితర సమస్యలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా అసంపూర్తి పనులు ఉంటే వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డిఇఇ జ్యోతిరెడ్డి, హెచ్ఎండబ్ల్యూ డిఇఇ హరీష్, ఎఇఇ వినీల్‌గౌడ్, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

జోనల్ కమిషనర్ పంజకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

వనస్థలిపురం, జూన్ 10 ప్రభాతవార్త : బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ ఫేజ్-2లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని అక్రమనిర్మాణాలపై చర్యలుతీసుకోవాలని ఫేజ్-2 అసోసియేషన్ నాయకులు ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రం సమర్పించారు. శ్రీపురం కాలనీ ఫేజ్-2లో ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్లు నిర్మిస్తున్నారని అదేవిధంగా సెట్ బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు చెప్పినప్పటికీ నిర్మాణాలు ఆగడం లేదన్నారు. ఇష్టారాజ్యంగా నిర్మించుకోవడంమూలంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కాలనీ అధ్యక్షుడు కాల్వ శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాశం విఠల్‌రెడ్డి, జంగయ్యగౌడ్, సికిందర్‌రెడ్డి, బాకారం నర్సింహ్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సామ మాధవరెడ్డి తదితరులు జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు.

చెత్త సేకరణపై ప్రజలకు ప్రజలకు అవగాహన

చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తూ ప్లెక్సీలు ఏర్పాటు చేసిన దృశ్యం.

ఉప్పల్, జూన్ 10 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్‌లో చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిసి అంజనేయులు పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్ చౌరస్తాలో పలు ప్రాంతాల్లో చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తూ ప్రధాన కూడళ్ల వద్ద ప్లెక్సీలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిసి అంజనేయులు, శానిటేషన్ డిఇ చందన, సూపర్‌వైజర్ కె.సుదర్శన్‌లు మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా అవగాహన కల్పిస్తున్నామని, చెత్త వేసే ప్రాంతాల్లో సిసి కెమెరాలు, మైక్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా చెత్త వేస్తే తమకు సమాచారం వస్తుందని, వాహనాలతో చెత్త తెచ్చి వేస్తే వారి నెంబర్లు నమోదు చేసుకుంటున్నామని తెలిపారు. చెత్తఆటోలకు నెంబర్లు కేటాయించామని, ప్రతి ఇంటికి నెంబరింగ్ ఇచ్చినట్లు తెలిపారు. చెత్త ఆటోలకు ఇవ్వని ఇంటి నెంబర్లు గుర్తించి వారికి అవగాహన కల్పిస్తామని, అనంతరం వారికి జరిమానా వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోది ప్రమాణ స్వీకారంతో సంబురాలు

సంబురాలు జరుపుకుంటున్న బిజేపీ శ్రేణులు

తార్నాక, జూన్ 10 ప్రభాతవార్త : ప్రధానిగా మూడోసారి నరేంద్రమోది, మంత్రులుగా కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సాయంత్రం తార్నాక చౌరస్తాలో బిజేపీ శ్రేణులు స్వీట్లు పంచి, టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ గౌడ్, పోచయ్యయాదవ్, కొన్నె సంపత్,మల్లికంటి వీరన్న, ఆకుల శ్రీనివాస్, శ్రీనివాస్ చారి, ఉపేందర్ యాదవ్, ఆకుల శ్రీనివాస్, ప్రకాష్ గౌడ్, నరసింహ్మ, రాజు జైన్, గర్షమోహన్, జమ్మికుంట వేణు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి : గీత

ఉప్పల్, జూన్ 10 ప్రభాతవార్త : వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం చిలుకానగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో జిహెచ్ఎంసి, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో వర్షాకాలంలో అధికంగా డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని, మంచి నీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై నీరు నిల్వకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించాలని, నాలా పూడిక తీత పనులు త్వరగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇ నిఖిల్‌రెడ్డి, ఎఇ రాజ్‌కుమార్,జలమండలి డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, అసిఫ్‌అలీ, డిఇ చందన, శానిటరీ సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రెడ్డి, విద్యుత్ ఎఇ నిఖిల్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో యోగా వేడుకలు

ఉప్పల్, జూన్ 10 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో సోమవారం అంతర్జాతీయ మహిళా సాధికారత యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు కరుణాకర్‌రావు పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులకు యోగా అసనాలు చేయిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రెవ.బ్రదర్ జోసప్ పసల మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరు యోగా నేర్చుకోవాలని, యోగా చేయడం ద్వారా మానసిక, శారీరక వికాసానికి పెంపొందుతుందన్నారు.

ఉప్పల్ భగాయత్‌లో వాణిజ్య భవనాలకు అనుమతి లేదు

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిసి అంజనేయులు తదితరులు

ఉప్పల్, జూన్ 10 ప్రభాతవార్త : ఉప్పల్ భగాయత్‌లో వాణిజ్య భవనాలకు అనుమతి లేదని ఉప్పల్ డిప్యూటి కమిషనర్ అంజనేయులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి పలు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిసి అంజనేయులు మాట్లాడుతూ ఉప్పల్ భగాయత్‌లో అనుమతి లేకుండా షెడ్లు, పంక్షన్‌హాల్స్, హోటల్స్, బండల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వీటికి నోటీసులు ఇచ్చి కూల్చివేస్తామని తెలిపారు. ఇప్పటికే నిర్మించిన నిర్మాణాలకు రెండింతలు పన్ను వేయడంతోపాటు, విద్యుత్ బిల్లులు, నల్లా బిల్లులు కూడా రెండింతలు వేస్తారని తెలిపారు. అనుమతి లేకుండా చేపట్టే నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. నాలా వెంట నిర్మాణ వ్యర్థాలు వేయకుండా బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్మాణ వ్యర్థాలు వేసే వాహనాల సమాచారం ఇచ్చిన వారికి రూ.వెయ్యి బహుమతి అందజేస్తామని తెలిపారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఆటో రిక్షాలకు చెత్త వేయాలని, దీనిపై సర్వే చేస్తున్నామని తెలిపారు. పది వేల మంది నివాస గృహాల యజమానులు చెత్త ఇవ్వడం లేదన్నారు. వీరికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. శిల్పారామంవైపు మాత్రమే మల్టీపర్పస్ జోన్‌గా గుర్తించారని, అక్కడే అన్ని విధాలుగా నిర్మాణాలు చేసుకోవచ్చని తెలిపారు. వర్షాకాలంలో రోడ్లుపై వర్షం నీరు నిల్వ ఉండకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్, శానిటేషన్ డిఇ చందన, శానిటరీ సూపర్‌వైజర్ కె.సుదర్శన్, టిపిఒ వెంకటరమణ, ఎఎంసి శ్రీనివాస్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే బలాల

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల కార్పొరేటర్ సలాం షాహిద్

మలక్‌పేట, జూన్ 10 ప్రభాతవార్త : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు చావుని డివిజన్లోని బాగే జహారా వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ సలాం సాహిత్తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు ఎంత దొహదపడతాయన్నారు ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. సయ్యద్ తాజుద్దీన్ నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వర్ణకార వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాఘవాచారి

సైదాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: కార్పొరేట్ జ్యూవెలరీ దుకాణాలతో ఉపాధిని కోల్పోతున్న సాధారణ స్వర్ణకారులకు ప్రభుత్వం చేయూత నందించాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలంగాణా రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు విజమూరి రాఘవాచారి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాఘవాచారి మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుతో స్వర్ణకారులకు మంచి రోజులు వస్తాయని భావించడం జరిగిందని, అయితే ప్రస్తుతం స్వర్ణకారుల కుటుంబ పరిస్థితులు చాలా దయనీయంగా ఉన్నాయన్నారు. పనులు లేకపోవడంవల్ల గత ఆరు నెలల కాలంలోనే 14 మంది స్వర్ణకారులు ఆత్మహత్యలకు పాల్పడడం జరిగిందన్నారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న 5 మెన్ కమిటీ రిపోర్టును యధాతథంగా అమలు చేయాలని, తమిళనాడులో ఉన్న విధంగా మన రాష్ట్రంలో కూడా వెంటనే స్వర్ణకార వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, హోం డిపార్ట్‌మెంటు జి.ఓ.272ను పటిష్టంగా అమలు చేసి అందులోని లోపాలను సరిదిద్ది స్వర్ణకారులపై పోలీసుల వేధింపులు అరికట్టాలని, పుస్తెలు, మెట్టెలు, ప్రధానపు ఉంగరాలు, లక్ష్మి రూపు పనులను కేవలం స్వర్ణకారులే చేసే విధంగా, కార్పొరేట్ జ్యూవెలరీతో పాటు సాధారణ జ్యూవెలరీ దుకాణాల్లో వీటిని అమ్మకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా జిఓ తీసుకురావాలని, అకాల మరణం పొందిన స్వర్ణకారులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని, గీతా కార్మికులకు ఇస్తున్న విధంగా స్వర్ణకారులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. తాము చేసిన విన్నపానికి మంత్రి సానుకూలంగా స్పందించి తగిన న్యాయం చేస్తామని హామీనిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం కార్యవర్గ సభ్యులు చేపూరి వెంకటస్వామి, సిరికొండ రవీంద్రాచారి, మంచోళ్ల రాజమౌళిచారి, రాగిఫణి సతీష్‌చారి, పోతులూరాచారి విజమూరి వెంకటాచారి, బ్రహ్మం సిద్దేశ్వరా చారి తదితరులు పాల్గొన్నారు.

బిజెపితోనే అభివృద్ధి సాధ్యం : సురేందర్‌రెడ్డి

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను అభినందిస్తున్న సురేందర్‌రెడ్డి

మలక్‌పేట,జూన్ 10 ప్రభాతవార్త : బిజెపితోనే అభివృద్ధి సాధ్యమని భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు.కేంద్రమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌ను నాయకులు, కార్యర్తలతో కలిసి సురేందర్‌రెడ్డి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా బండి సంజయ్‌ను నియమించడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలగురించి ప్రజలకు వివరించి చైతన్య పరుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీట్‌లో సత్తా చాటిన విద్యార్థికి సన్మానం

సరూర్‌నగర్, జూన్ 10 ప్రభాతవార్త: జాతీయ స్థాయిలో జరిగిన నీట్-2024 ఫలితాల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి 720 మార్కులకు గాను 640 మార్కులు సాధించిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 28వ డివిజన్ శ్రీనిలయ టౌన్‌షిప్‌కు చెందిన విద్యార్థిని సీతా ప్రనూషను స్థానిక కార్పొరేటర్, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్ సన్మానించి అభినందనలు తెలిపారు. సోమవారం వారి నివాసానికి తరలివెళ్ళిన కార్పొరేటర్ సీతా ప్రనూషను శాలువాలతో సన్మానించి స్వీటు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని తల్లిదం డ్రులు సంతోష, కృష్ణలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీట్ టాపర్లలో ఒకరిగా నిలిచి ప్రనూష బడంగ్‌పేట్‌కు పేరు తీసుకొచ్చారని కొనియాడారు.

కేంద్ర సహాయమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్‌ను బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానిస్తున్న దృశ్యం (ప్రభాతవార్త, వనస్థలిపురం)

కేంద్ర మంత్రులకు నాయకుల సన్మానం

బండి సంజయ్‌ను సన్మానిస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి
మరో చిత్రంలో కిషన్‌రెడ్డిని సత్కరించిన అందెల శ్రీరాములు యాదవ్

సరూర్‌నగర్, జూన్ 10 ప్రభాతవార్త: కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సికింద్రాబాద్ ఎంపి గంగాపురం కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌లను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి సన్మానించారు. ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేసిన వారిని కలిసిన ఆయన శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, విజయ రామారావు, లక్ష్మణ్, దీప్‌చంద్, ఆర్‌కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు అందెల సన్మానం

ప్రధాని నరేంద్రమోడి మంత్రివర్గంలో మంత్రులుగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన గంగాపురం కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను ఢిల్లీ వెళ్ళిన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ వారిని కలిసి పుష్పగుచ్ఛాలనిచ్చి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ యెల్మేటి దేవేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిసిపికి వినతి : బాలకృష్ణ

డిసిపికి వినతిపత్రం అందజేస్తున్న బాలకృష్ణ

సైదాబాద్, జూన్ 10 సప్రభాతవార్త: గో సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరుతూ అఖిల భారత గో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి ధరావత్ జానకికి వినతి పత్రం అందజేశారు. బ్రకీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని, గో రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిసిపిని కోరారు. కార్యక్రమంలో గో సేవా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి మల్లేష్‌గౌడ్, రాఘవేందర్, మాణిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

నాట్య కళాకారులను సన్మానిస్తున్న దేవస్థానం నిర్వాహకులు

సైదాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: కేరళ రాష్ట్రం త్రిసూర్‌లోని పెరింగోటుకర శ్రీ విష్ణుమాయ దేవస్థానంలో జరిగిన శతాబ్ది నృత్యోత్సవంలో నగరానికి చెందిన కోమల్‌బాబు మాడు శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అందరిని ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన అనంతరం దేవస్థానం అధివతి డాక్టర్ ఉన్ని స్వామి కల్ నృత్య కళాకారులను సన్మానించి ప్రశంసా పత్రాలు, షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గురూజి కోమల్ బాబు మాడు, నాట్య కళాకారులు కౌశిక, వేదాక్షర, భవ్య, యాక్షిక, చైత్ర, మౌనిక, దిషిత, దుర్గ, కీర్తన, సాయి కృతి, చాయిత్ర, శృతి, ప్రియాంక, ప్రణవి, సాహితి, అనన్య, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి : నర్సింగరావు

సమావేశంలో మాట్లాడుతున్న గజం నర్సింగరావు

మలక్‌పేట, జూన్ 10 ప్రభాతవార్త : గ్రామీణ ప్రాంతాలలో దివ్యాంగులు తయారు చేస్తున్న వస్తువులను మార్కెట్లో విక్రయించడానికి అనువుగా ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేసి ఆర్థికంగా బలోపేతం కావడానికి వరల్డ్ పద్మశాలి ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ గజం నర్సింగ్‌రావు పేర్కొన్నారు. నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల జాతీయ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన భారత కళామేల జాతీయస్థాయి ఎగ్జిబిషన్‌ను దివ్యాంగులతో కలిసి ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకలాంగులతో సమానంగా వికలాంగులకు అవకాశం కల్పించడం ద్వారా వారిలో ఉన్న ఆత్మాన్యున్నత భావం తొలగిపోతుదని అన్నారు. జాతీయస్థాయి ఎగ్జిబిషన్లో దివ్యాంగులతో పాటు దేశంలోని తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు స్టాళ్లను ఏర్పాటు చేస్తారన్నారు. దివ్యాంగుల ఉత్పత్తులకు సరైన మార్కెట్ సదుపాయాలు లభిస్తే ఆర్థికంగా వారు బలోపేతం అవుతారన్నారు. ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిజేబుల్, వరల్డ్ పద్మశాలి ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడ్ చైర్మన్ మద్దెల గంగారం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ నారా నాగేశ్వరరావు, శ్రీనివాస్, అలపాటి రమేష్, గోపి, వసంత, విద్యావతి, గాయకుడు ధనుంజయ్ పాల్గొన్నారు.

నిలిచిపోయిన పనులను వేగవంతంగా పూర్తి చేయండి : మేయర్ పారిజాత



అధికారులతో సమీక్ష చేస్తున్న మేయర్ పారిజాత

సరూర్‌నగర్, జూన్ 10 ప్రభాతవార్త: గడచిన ఆరు నెలల కాలంలో వచ్చిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వల్ల కోడ్ కారణంగా నిలిచిన అభివృద్ధి పనులన్నింటినీ తిరిగి ప్రారంభించి వేగవంతం చేయాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధికారులను ఆదేశించారు. బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడలోని కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తో కలిసి కమీషనర్ జి.రఘు, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు, వాటి స్థితిగతులు తదితర వాటిపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకొని టెండర్ ప్రక్రియ పూర్తి అయిన రూ.12 కోట్లకు సంబంధించిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం దృష్ట్యా నాలాలు శుభ్రం చేయాలనీ, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని, వీధి దీపాల సమస్యలు తలెత్తకుండా చేయాలని ఆమె అన్నారు. కార్పొరేషన్‌లో ఎస్ఎన్‌డిపి పనులు, కోర్టు కేసుల వల్ల నిలిచిన పనులు పూర్తి అయ్యేందుకు కృషి చేస్తామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఇలు జ్యోతిరెడ్డి, యాదయ్య, హెచ్ఎండబ్ల్యూ డిఇఇ హరీష్, కార్పొరేషన్ ఎఇఇలు బిక్కు నాయక్, వినీల్‌గౌడ్, రెవెన్యూ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ వంకాయల యాదగిరి, మేనేజర్ నగేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్థులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలి : పోల్కం శ్రీనివాస్

మంత్రి సురేఖకు వినతి పత్రం సమర్పిస్తున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

మలక్‌పేట, జూన్ 10 ప్రభాతవార్త : మేరు కులస్థులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని టిపిసిసి ఒబిసి సెల్ సీనియర్ జనరల్ సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మంత్రి కొండా సురేఖను కలిసి చట్ట సభల్లో మేరు కులస్థులకు అన్యాయం జరిగిందని, నామినేటెడ్ పదవులలో మేరు కులస్థులకు అవకాశం కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు దశాబ్దాలనుండి కాంగ్రెస్ జెండా మోస్తున్న మేరులకు ఎటువంటి అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, నవీన్‌కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సఫిల్‌గూడ చెరువులో నాలా పూడిక తీత పనులను చేపట్టాలని వినతి

హెచ్ఎండీఏ జెడి ఆమ్రాపాలికి వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ శ్రావణ్..

నేరెడ్‌మెట్, జూన్ 10 ప్రభాతవార్త: సఫిల్‌గూడ చెరువులో పెరిగిన గుర్రపు డెక్కతో పాటు నాలా పూడికతీత పనులను చేపట్టాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ శ్రావణ్ సోమవారం మున్సిపల్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో హెచ్ఎండీఏ జాయింట్ డైరెక్టర్ ఆమ్రాపాలికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని సఫిల్‌గూడ చెరువులో గుర్రపు డెక్క, నాలా పూడికతీత, పబ్లిక్ టాయిలెట్స్, స్ట్రీట్ లైట్స, ఫుట్‌పాత్ సుందరీకరణ తదితర పనులను చేపట్టాలని వినతి పత్రం అందించడం జరిగిందన్నారు. వర్షాకాలంలో డివిజన్ పరిధిలో ఉన్న లోతట్టుప్రాంతాలు జలమయం కాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. డివిజన్ ప్రజలు ఎటువంటి ఇబ్బందికి గురికాకుండా తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డికి సన్మానం